క్లుప్తంగా

కార్యదర్శుల సంఘ అధ్యక్షుడిగా రామారావు



వీరులపాడు(కంచికచర్ల):స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం మండల పంచాయతీ కార్యదర్శుల సంఘం నూతన కార్యవర్గ ఎన్నిక జరిగింది. మండల కార్యదర్శుల సంఘ అధ్యక్షుడిగా ఐవీ రామారావు, ప్రధానకార్యదర్శిగా వై.సునీల్‌కుమార్, ఉపాధ్యక్షుడిగా బి.సాంబశివరావు, కోశాధికారిగా బి.అజయ్‌కుమార్, జాయింట్ సెక్రటరీగా బి.వీరభద్రరావు, ప్రచార కార్యదర్శిగా ఆర్.రాజశేఖర్, కార్యవర్గ సభ్యులుగా పి.మౌనిక, డి.రాణి ఎన్నికయ్యారు. కార్యవర్గ ఎన్నికను ఈవోపీఆర్డీ వి.సీతారామరాజు పర్యవేక్షించారు. సంఘ నూతన అధ్యక్షుడు రామారావు మాట్లాడుతూ పంచాయతీ కార్యదర్శుల సమస్యలు పరిష్కారానికి తనవంతు కృషిచేస్తానన్నారు. కార్యదర్శులు గ్రామాల్లో ప్రజలకు అందుబాటులో ఉండేలా చూస్తానని వివరించారు.

పారిశుద్ధ్యంపై స్పెషల్ డ్రైవ్



పెనుగంచిప్రోలు: ఈనెల 11 నుంచి నిర్వహించనున్న శ్రీతిరుపతమ్మవారి పెద్ద తిరునాళ్ల ఉత్సవాలు పురస్కరించుకుని గ్రామంలో పారిశుద్ధ్యంపై స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నారు. వీధులు, ఆలయ పరిసరాల్లో జేసీబీ సాయంతో చెత్తచెదారం తొలగించటంతోపాటు మురుగు కాలువలు శుభ్రం చేస్తున్నారు. ఆయా పనులను సర్పంచ్ వేల్పుల పద్మకుమారి పరిశీలించారు. తిరునాళ్ల ఉత్సవాలను దృష్టిలో ఉంచుకుని పారిశుద్ధ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నట్లు సర్పంచి తెలిపారు. గ్రామస్తులు కూడా సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కె.శ్యామ్, సిబ్బంది పాల్గొన్నారు.

పారిశుద్ధ్య పనుల పరిశీలన



నందిగామటౌన్(నందిగామరూరల్): పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచడంతోపాటు ప్రజలకు ఆహ్లాదకర వాతావరణాన్ని కల్పించేందుకు కృషి చేస్తున్నామని మున్సిపల్ కమిషనర్ రమణబాబు తెలిపారు. పట్టణంలోని ఆయావార్డుల్లో నిర్వహిస్తున్న పారిశుద్ధ్య పనులను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ చెత్తాచెదారాలను, తడిపొడి చెత్తను రోడ్లపై పడేయకుండా మున్సిపల్ చెత్త సేకరణ సిబ్బందికి అందించాలని ప్రజలను కోరారు. అనంతరం ప్రజలకు సరఫరా చేస్తున్న తాగునీటి శాంపిల్స్‌ను, రైతుబజార్ వద్దనున్న అన్నా క్యాంటిన్‌ను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఏఈ ఫణి శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

సమాచార హక్కు చట్టంపై అవగాహన



చిల్లకల్లు(జగ్గయ్యపేట): స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సమాచార హక్కు చట్టంపై శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏవో వరలక్ష్మి మాట్లాడుతూ ప్రతి ఒక్కరు సమాచార హక్కుచట్టంపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ముఖ్యంగా సమాచారం కావాల్సినవారు అర్జీ రూపంలో పొందవచ్చని తెలిపారు. ప్రతి ప్రభుత్వ శాఖలో సమాచారాన్ని అర్జీ ద్వారా 30 రోజుల్లో పొందవచ్చని సూచించారు. ఈ చట్టం కింద దేశ సార్వభౌమత్వానికి భంగం కలగని సమాచారం మాత్రమే పొందే వీలుంటుందని తెలిపారు. కార్యక్రమంలో రైతులు సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఆలయానికి రూ.1.31లక్షల ఆదాయం

నందిగామరూరల్: మండలంలోని దాములూరులో వేంచేసియున్న సంగమేశ్వరస్వామి వారి ఆలయంలో నిర్వహించిన పలుహక్కుల వేలం ద్వారా రూ.1.31లక్షల ఆదాయం వచ్చిందని ఈఓ నరసింహమూర్తి తెలిపారు. నాలుగు రోజుల పాటు జరగనున్న మహాశివరాత్రి ఉత్సవాలకు లడ్డూ ప్రసాదం, కొబ్బరిచిప్పలు పోగు చేసుకునే హక్కుకు శుక్రవారం ఆలయ ఆవరణలో టెండర్ కం బహిరంగ వేలం పాట నిర్వహించారు. లడ్డూ ప్రసాదం అమ్ముకునే హక్కులను దాములూరు గ్రామానికి చెందిన తోట నరేష్ రూ. 89 వేలకు, కొబ్బరిచిప్పలు పోగు చేసుకునే హక్కులను పచ్చల శివప్రసాద్ రూ. 42 వేలకు దక్కించుకున్నట్లు ఈఓ వివరించారు. సర్పంచ్ గాదెల వెంకట రామారావు, గింజుపల్లి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

అధ్వానంగా ముక్త్యాల పుష్కర ఘాట్‌లు

- పట్టించుకోని అధికారులు..
- ఈనెల 23 నుంచి శివరాత్రి మహోత్సవాలు
- భక్తులకు తప్పేలాలేని ఇబ్బందులు



కృష్ణానది ఒడ్డున అధ్వానంగా ఉన్న పుష్కర ఘాట్



నది ఒడ్డున పగిలిపోయిన మెట్లు

ముక్త్యాల(జగ్గయ్యపేట): జగ్గయ్యపేట మండలంలోని ముక్త్యాల భవానీ ముక్తేశ్వరస్వామి ఆలయ సమీపంలోని పుష్కర ఘాట్‌లు అధ్వానంగా ఉన్నాయి. ఘాట్‌ల వద్ద అపరిశుభ్ర వాతావరణంతోపాటు చెత్తాచెదారం పేరుకుపోయాయి. కొన్నిచోట్ల ఘాట్‌ల మెట్లు కూడా పూర్తిగా ధ్వంసమయ్యాయి. ఈనెల 23 నుంచి స్వామివారి కళ్యాణ మహోత్సవాలకు లక్షమందికి పైగా భక్తులు హాజరై పుణ్యస్నానాలు ఆచరించే అవకాశం ఉండగా, పుష్కరఘాట్లు ఇలా అధ్వానంగా ఉండటంతో భక్తులకు ఇబ్బందులు తప్పేలా లేవు.

దుర్గంధం వెదజల్లుతున్న పరిసరాలు..

ఈ నెల 26న నిర్వహించనున్న మహాశివరాత్రి పండుగకు ఏపీ, తెలంగాణా రాష్ట్రాల నుంచే కాకుండా పలు ప్రాంతాల నుంచి పెద్దసంఖ్యలో భక్తులు ఈ ఉత్తరవాహిని కృష్ణానదిలో పుణ్య స్నానాలు ఆచరించేందుకు ముక్త్యాల తరలివస్తారు. శివరాత్రి ఒక్క రోజే లక్ష మందికి పైగా భక్తులు పుణ్య స్నానాలు ఆచరించే అవకాశం ఉంది. అటువంటి పవిత్ర ఘాట్‌ల వద్ద పారిశుద్ధ్య పరిస్థితి అధ్వానంగా మారి దుర్గంధం వెదజల్లుతుండటంపై భక్తులు పెదవి విరుస్తున్నారు.

ప్రమాదకరంగా రోడ్డు..

జగ్గయ్యపేట నుంచి ముక్త్యాల వెళ్లే రోడ్డులో ప్రయాణమంటేనే భక్తులు భయాందోళన చెందుతున్నారు. 10 కి.మీల మేర రహదారి పొడవునా ప్రమాదకరమైన మలుపులుండటంతో తరచూ ఈ రోడ్డులో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి ప్రమాద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు అంశాన్ని కూడా అధికారులు విస్మరించారు. విశాఖ స్టీల్ ప్లాంట్, పాలేటి బ్రిడ్జి, అంకమ్మ ఆలయం, కోటిలింగాల శైవక్షేత్రం వద్ద మలుపులు ప్రమాదకరంగా మారాయి. ఏటా శివరాత్రికి వచ్చే భక్తులు ప్రమాదాల బారిన పడుతున్నా సంబంధిత అధికారుల్లో మాత్రం ప్రమాదహెచ్చరిక బోర్డులు ఏర్పాటు అంశంపై ఎటువంటి చలనం ఉండటం లేదు. గతేడాది సెప్టెంబరులో వచ్చిన వరదతో పాలేటి బ్రిడ్జి సగం మేర కొట్టుకుపోవటంతో అధికారులు మట్టి, రాళ్లతో తూతూమంత్రంగానే మరమ్మతులు చేశారు. ప్రస్తుతం ఎదురుగా భారీ వాహనం వస్తే రెండో వైపు వాహనాలు ఆగిపోవాల్సిన పరిస్థితి నెలకొంది. ఈపరిస్థితుల్లో శివరాత్రి పండగ రోజున ట్రాఫిక్ సమస్య మరింత పెరుగుతుందని స్థానికులు చెబుతున్నారు.

రూ.కోటి ఆదాయం ఉన్నా.. పారిశుద్ధ్యం సున్నా..

దేవదాయ, పంచాయతీరాజ్ శాఖల అధికారుల మధ్య సమన్వయం కొరవడటంతో ఏటా మహాశివరాత్రి ఉత్సవాలలో పారిశుద్ధ్యం పరిస్థితి అధ్వానంగా తయారవుతోంది. పుష్కరఘాట్ల వద్ద పారిశుద్ధ్యం మెరుగుగా ఉండేలా చూడటంలో ఈశాఖల అధికారులు ఏటా విఫలమవుతూనే ఉన్నాయి. దీంతో అధికారుల మధ్య కొరవడిన సమన్వయ సమస్య భక్తుల పాలిట శాపంగా మారుతోంది. గ్రామపంచాయతీకి ప్రతిఏటా రూ.కోటిపైగా ఆదాయం వస్తున్నా తగిన పారిశుద్ధ్య చర్యలు చేపట్టడంతో పంచాయతీ అధికారులు నిర్లక్ష్యాన్ని వీడటం లేదు. ఇకనైనా పంచాయతీ అధికారులు స్పందించి పుష్కరఘాట్లను శుభ్రం చేయడంతోపాటు ఆయా ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచేందుకు తగిన చర్యలు తీసుకోవాలని భక్తులు కోరుతున్నారు.



పుష్కర ఘాట్ వద్ద పారిశుద్ధ్య పరిస్థితి ఇలా



జగ్గయ్యపేట-ముక్త్యాల రోడ్డులో గుంతలమయంగా ఉన్న పాలేటి బ్రిడ్జి

ఏటా భక్తులకు అసౌకర్యం...

ఏటా జరిగే మహాశివరాత్రి ఉత్సవాల సందర్భంగా భక్తులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. ముఖ్యంగా ఘాట్‌ల వద్ద పారిశుద్ధ్య పరిస్థితి అధ్వానంగా ఉంటుండటంతో అవస్థలు తప్పడం లేదు. ముక్త్యాల పంచాయతీకి ఆదాయం ఉన్నా అభివృద్ధి విషయంలో పంచాయతీ అధికారులు తగిన శ్రద్ధ చూపడం లేదు. శివరాత్రి పండగ సందర్భంగా భక్తులకు ఎటువంటి అసౌకర్యం లేకుండా దేవదాయ,పంచాయతీరాజ్‌శాఖల అధికారులు తగిన చర్యలు చేపట్టాలి.

స్వాగత ద్వారాలు ఏర్పాటు



వత్సవాయి: ఈ నెల 11న జరగనున్న పెనుగంచిప్రోలు శ్రీ గోపయ్య సమేత లక్ష్మీ తిరుపతమ్మ అమ్మవారి కల్యాణాన్ని పురస్కరించుకుని స్వాగత ద్వారాలను ఏర్పాటు చేశారు. చిల్లకల్లు, మక్కపేట, బోనకల్లు, ముండ్లపాడు క్రాస్‌రోడ్స్ వద్ద అమ్మవారి తిరునాళ్ల వివరాలను తెలియజేస్తూ భక్తులకు స్వాగతం పలుకుతూ ఈ ద్వారాలు ఏర్పాటు చేశారు. ముఖ్యంగా ఖమ్మం నుంచి వస్తున్న భక్తులకు బోనకల్లు వద్ద, గుంటూరు జిల్లా నుంచి వస్తున్న భక్తులకు ముండ్లపాడు వద్ద, నల్గొండ జిల్లా నుంచి వచ్చే భక్తులకు చిల్లకల్లు, మక్కపేటల వద్ద పెనుగంచిప్రోలుకు దారిని తెలియజేస్తూ ఆలయాధికారులు ఈ స్వాగత ద్వారాలను ఏర్పాటు చేస్తున్నారు. ఏటా నెల రోజుల్లోనే సమయంలోనే రెండు దఫాలుగా ఈ స్వాగత ద్వారాలు ఏర్పాటు చేస్తూ లక్షలాది రూపాయలను వృధా చేసే కంటే ఆయా ప్రదేశాల వద్ద దేవస్థానం తరుపున శాశ్వత ఆర్చీల నిర్మాణం చేపట్టడం మేలని అభిప్రాయం భక్తుల నుంచి వినిపిస్తోంది. ఆదిశగా ఆలయ అధికారులు చర్యలు తీసుకోవాలని భక్తులు కోరుతున్నారు.

విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవాలు

నందిగామరూరల్: మండలంలోని కొణతమాత్మకూరులో వేంచేసియున్న వేజెండ్ల కోటయ్య సహిత భక్తాంజనేయస్వామి వారి ఆలయ ప్రాంగణంలో శ్రీకృష్ణ సహిత గణపతి విగ్రహావాయు ప్రతిష్ఠా మహోత్సవాలు శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. గణపతి పూజ, వాస్తుపూజ, దీక్షాధారణ, మండపారాధన తదితర పూజలను నిర్వహించారు. పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

పశువుల పాకల్లా...ప్రభుత్వ భవనాలు





నందిగామ మండలం కంచల గ్రామంలో చేపట్టిన గ్రామసచివాలయం, ఆర్బీకే, వెల్‌నెస్ సెంటర్ల భవన నిర్మాణపు పనులు అసంపూర్తిగా మిగిలిపోయాయి. దీంతో ఆయా భవనాలను స్థానికులు కొందరు పశువుల పాకలా వినియోగిస్తున్నప్పటికీ సంబంధిత అధికారులు కనీసం పట్టించుకోకపోవడం గమనార్హం. ఇదీ కూటమి పాలనలో గ్రామపాలన తీరు అనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇకనైనా పాలకులు స్పందించి ఆయా భవన నిర్మాణాలను పూర్తి చేయించి, వినియోగంలోకి తీసుకురావాలని గ్రామస్తులు కోరుతున్నారు. -కంచికచర్ల

మాజీ సీఎం వైఎస్ జగన్‌ను కలిసిన ఎమ్మెల్సీఅరుణకుమార్

నందిగామరూరల్: మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఎమ్మెల్సీ డాక్టర్ మొండితోక అరుణకుమార్ శుక్రవారం ఆత్మీయంగా కలిశారు. గన్నవరం విమానాశ్రయంలో వైఎస్ జగన్‌ను కలిసి నందిగామ నియోజకవర్గ పరిస్థితులను వివరించారు.

మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో కరచాలనం చేస్తున్న ఎమ్మెల్సీ డాక్టర్ మొండితోక అరుణకుమార్ →



వైభవంగా ప్రతిష్ఠా మహోత్సవం

చందర్లపాడు(నందిగామరూరల్):మండలంలోని బబ్బెళ్లపాడులో అంకమ్మ తల్లి, పోతురాజు, పరివారముల పాంచాహ్నిక ప్రతిష్ఠా మహోత్సవ వేడుకలు శుక్రవారం వైభవంగా జరిగాయి. ప్రతిష్ఠా మహోత్సవం సందర్భంగా తరలివచ్చిన బంధువులతో గ్రామంలోని ఇళ్లన్నీ సందడిగా మారాయి. టీటీడీ శ్రీవాణి ట్రస్ట్, ప్రభుత్వ సర్వశ్రేయో నిధులు, భక్తుల విరాళాలతో నూతనంగా నిర్మించిన ఆలయంలో ఉదయం 11.26 గంటలకు వేద మంత్రోచ్ఛరణల నడుమ విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ముందుగా విఘ్నేశ్వర పూజ, పుణ్యాహం అంగహోమం, రక్షా హోమం, గర్తన్యాసం, బీజన్యాసం, యంత్రస్థాపన కార్యక్రమాలను కన్నులపండువగా జరిపించారు. విగ్రహ ప్రతిష్ఠ కళాన్యాసం, ప్రాణ ప్రతిష్ఠ, కుంభ ధేను దర్శనం, పూర్ణాహుతి పూజా కార్యక్రమాలు చేశారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో బబ్బెళ్లపాటి గోపాలకృష్ణ సాయి, నిర్వాహకులు, పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ఐక్యంగా నిర్వహించడం అబినందనీయం..

ప్రతిష్ఠా మహోత్సవాలను గ్రామస్తులంతా ఐక్యంగా నిర్వహించుకోవడం అభినదనీయమని నందిగామ మాజీఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు పేర్కొన్నారు. గ్రామంలో నిర్వహించిన ప్రతిష్ఠా మహోత్సవంలో ఆయన పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ జగన్‌మోహనరావు మాట్లాడుతూ దాతల విరాళాలతో ఆలయాన్ని నిర్మించటమే కాకుండా అంతకన్నా వైభవంగా ప్రతిష్ఠా మహోత్సవాన్ని నిర్వహించారని గ్రామస్తులకు అభినందనలు తెలియజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ మోహన్‌రెడ్డి, నాయకులు నెలకుదిటి శివనాగేశ్వరరావు, నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



ప్రతిష్ఠా మహోత్సవంలో పాల్గొని పూజలు చేస్తున్న మాజీ ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

ప్రత్యేక పూజలు



జగ్గయ్యపేట అర్బన్: రోహిణి నక్షత్రం సందర్భంగా శుక్రవారం పట్టణంలోని వేణుగోపాలస్వామి ఆలయంలో భక్తులు శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. స్వామి వారిని వివిధ రకాల పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించి పాలాభిషేకం చేసి మొక్కులు చెల్లించుకున్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తత అవసరం

కంచికచర్ల: సమాజంలో రోజురోజుకు పెరుగుతున్న సైబర్ నేరాల బారినపడకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని నందిగామ రూరల్ సర్కిల్ సీఐ డి చవాన్ సూచించారు. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్రాంచ్ మేనేజర్ సురేంద్ర ఆధ్వర్యంలో సైబర్ నేరాలపై స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌లో శుక్రవారం విభూతి బ్రదర్స్ కళాజాత(బుర్రకథ కళాకారులు)ద్వారా ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈసందర్భంగా సీఐ చవాన్ మాట్లాడుతూ ఈజీమనీ పేరుతో కనిపించే యాప్‌లు, లోన్ యాప్‌ల విషయంలో జాగ్రత్తగా ఉండాలన్నారు. గుర్తు తెలియని వ్యక్తులు వివిధ యాప్‌ల ద్వారా సంప్రదించి, బ్యాంక్ అకౌంట్ నుంచి నగదును దోచుకునే అవకాశం ఉన్నందున అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎస్‌బీఐ మేనేజర్ ఎం సురేంద్ర మాట్లాడుతూ బ్యాంకు ఖాతాకు కైవైసీ కోసం ఓటీపీ చెప్పాలని, కస్టమ్స్ వద్ద చట్ట విరుద్ధమైన పార్సెల్ చిక్కుకుపోయిందని, జరిమానా కట్టాలంటూ వచ్చే ఫోన్‌కాల్స్ విషయంలో జాగ్రత్తగా ఉండాలన్నారు. గుర్తు తెలియని వ్యక్తులు ఫోన్‌చేసి తాము పోలీసు అధికారులమని విచారించాలని బెదిరిస్తే, సమీపంలోని పోలీసులకు తెలియజేయాలన్నారు. ఇటువంటి విపత్కర పరిస్థితుల్లో నేషనల్ సైబర్ క్రైం హెల్ప్‌లైన్ 1930 టోల్ ఫ్రీ నంబర్‌లో సంప్రదించి తగురక్షణ పొందాలని సూచించారు. కళాజాత సభ్యులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



ప్రయాణికులకు అవగాహన కల్పిస్తున్న కంచికచర్ల సీఐ చవాన్, కళాజాత బృందం

లెప్రసీ వ్యాధిపై అవగాహన



జగ్గయ్యపేటఅర్బన్: జగ్గయ్యపేట సబ్‌జైలులో ఖైదీలకు లెప్రసీ, టీబీ వ్యాధులపై శుక్రవారం అవగాహన కల్పించారు. క్షయ నిర్మూలన 100 రోజుల ప్రచార కార్యక్రమంలో భాగంగా జిల్లా లెప్రసీ, టీబీ విభాగ అధికారి డాక్టర్ జె.ఉషారాణి, సిబ్బంది కలిసి అవగాహన కల్పిస్తూ పోస్టర్లను ప్రదర్శించారు. లెప్రసీ లక్షణాలు, చికిత్స విధానంపై అవగాహన కల్పించారు. టీబీ పేషంట్లకు చికిత్స సమయంలో పోషకాహారం కోసం ప్రభుత్వం నెలనెలా వారి బ్యాంకు ఖాతాలో రూ.1000 చొప్పున 6 నెలలపాటు జమచేస్తుందన్నారు. టీబీ లక్షణాలు, లెప్రసీ లక్షణాలు కనిపించిన వెంటనే ప్రభుత్వాస్పత్రిలో చూపించుకుమందులు వాడాలని సూచించారు. కార్యక్రమంలో సబ్ జైలు సూపరిండెంట్ పట్టాబి రామయ్య, అసిస్టెంట్ టీబీ ఆఫీసర్ డాక్టర్ గుణశ్రీ, డిస్ట్రిక్ట్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ (డీపీసీ) దినేష్, డాప్‌లెస్(డీపీఎస్) తిరుపతిరావు, పబ్లిక్ ప్రైమరీ కోఆర్డినేటర్(పీపీఎం)లీలా, టీబీ సూపర్‌వైజర్ జి.నాగరాజు, పీపీ యూనిట్ వైద్యాధికారులు డాక్టర్ నాగరాణి, డాక్టర్ వాసంతి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

నందిగామను అభివృద్ధి చేస్తా : ఎమ్మెల్యే

నందిగామటౌన్(నందిగామ రూరల్) స్థానిక మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం మున్సిపల్ చైర్‌పర్సన్ ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ రమణబాబు చైర్‌పర్సన్ మండవ కృష్ణకుమారితో పదవీ ప్రమాణ స్వీకారం చేయించారు. ఈసందర్భంగా కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య మాట్లాడుతూ పట్టణాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసి చూపుతామన్నారు. గత ప్రభుత్వ హయాంలో దొంగ బిల్లులతో దోపిడీ చేశారని వాటిపై విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని తెలిపారు. కూటమి ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన వాట్సప్ గవర్నెన్స్‌ను నందిగామ మున్సిపాలిటీలో అమలు చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు వివరించారు. చైర్‌పర్సన్ కృష్ణకుమారి మాట్లాడుతూ ప్రభుత్వ విప్ సహకారంతో మున్సిపాలిటీని అభివృద్ధి చేసేందుకు శక్తివంచన లేకుండా పనిచేస్తానని తెలిపారు. అనంతరం చైర్‌పర్సన్ కృష్ణకుమారిని సత్కరించారు. కార్యక్రమంలో కౌన్సిల్ సభ్యులు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.



మున్సిపల్ చైర్‌పర్సన్ కృష్ణకుమారిని అభినందిస్తున్న ఎమ్మెల్యే సౌమ్య, కమిషనర్ రమణబాబు

రామలింగేశ్వరుని కల్యాణోత్సవాలు ప్రారంభం



నందిగామటౌన్ (నందిగామరూరల్:): పట్టణంలో వేంచేసియున్న శుకశ్యామలాంబ సహిత రామలింగేశ్వరస్వామి వారి కల్యాణోత్సవాలు కన్నుల పండువగా ప్రారంభమయ్యాయి. మహోత్సవాల్లో భాగంగా శుక్రవారం వేదమంత్రోచ్ఛరణల నడుమ స్వామి వారిని పెండ్లి కుమారునిగా అలంకరించారు. శుకశ్యామలాంబ అమ్మవారిని బాలత్రిపుర సుందరీదేవిగా అలంకరించి విశేష పూజలు చేశారు. అనంతరం స్వామివారికి మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, కుంకుమార్చనలతోపాటు నందివాహన సేవ నిర్వహించారు. రాత్రికి నిర్వహించిన కూచిపూడి, జానపద నృత్యప్రదర్శన చూపరులను ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఆలయ ఈవో గంగాధర్, వంశపారంపర్య ధర్మకర్త వాసిరెడ్డి మురళీ రాఘవకుమార్, పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

టీడీపీ నాయకునిపై హత్యాయత్నం

నందిగామరూరల్: మండలంలోని లింగాలపాడు గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు పసుపులేటి సూర్యప్రకాష్‌పై శుక్రవారం హత్యాయత్నం జరిగింది. సేకరించిన సమాచారం ప్రకారం మధ్యాహ్న సమయంలో సూర్యప్రకాష్ గ్రామంలోని తన నివాసం నుంచి నందిగామ వస్తూ రోడ్డుపై ఆగి ఉన్న కొంత మందితో మాట్లాడుతున్నాడు. ఈక్రమంలో అదే గ్రామానికి చెందిన కొంగర రామకృష్ణ అనే వ్యక్తి మరో బైకుతో వచ్చి సూర్యప్రకాష్‌ను ఢీకొట్టడంతోపాటు పదునైన వస్తువుతో దాడి చేశాడు. గమనించిన చుట్టుపక్కల వారు ఒక్కసారిగా కేకలు వేయటంతో రామకృష్ణ అక్కడి నుంచి పరారయ్యాడు. ఈ ఘటనలో సూర్యప్రకాష్‌కు గాయాలు కావడంతో హుటాహుటిన అతన్ని చికిత్స నిమిత్తం నందిగామ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఈ ఘటనకు పాతకక్షలే కారణమని సమాచారం.